

డయల్ యువర్ కలెక్టర్‌కు 15 కాల్స్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు కలెక్టరేట్‌లో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ మండలాల నుంచి 15 మంది తమ సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి కలెక్టరుకు నేరుగా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఫోన్ చేసిన 15 మంది సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ జిఎస్ఎస్.శ్రీనివాసు, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ

- వాహనదారుల అవస్థలు
- ఛార్జీలు చెల్లించినా వృథా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లావ్యాప్తంగా వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్‌సి), డ్రైవింగ్ లైసెన్స్ స్మార్ట్ కార్డులు రెండేళ్లుగా జారీ చేయడం లేదు. కార్యాలయానికి వెళ్లి అడిగితే త్వరలో పోస్టు ద్వారా పంపుతామని చెబుతున్నారు. కానీ పంపడం లేదు. ఆర్‌సి డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల తయారీకి అవసరమైన స్టేషనరీ లేకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని రవాణా శాఖ అధికారులు అంటున్నారు. 2021 ఆగస్టు నుంచి ఆర్‌సిలు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల సరఫరా నిలిచిపోయింది.

జిల్లావ్యాప్తంగా కొత్తగా వాహనం కొనుగోలు చేసినప్పుడు రవాణాశాఖ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆర్‌సిలో వాహనం రిజిస్ట్రేషన్ నంబరు, యజమాని పేరు, వాహనం తయారీ, నమూనా, వాహనం ఛాసిస్ నంబరు, ఇంజన్ నంబర్, ట్యాక్స్ వివరాలు, వాహనం తరగతి, రంగు, బరువు, క్యూబిక్ కెపాసిటీ, ఉపయోగించే ఇంధనం, రిజిస్ట్రేషన్, ఆర్‌సి గడువు తేదీ ముద్రించి ఉంటాయి. పూర్వం కొత్త రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ బుక్ (పేపర్లు) రూపంలో ఉండేది. కాలక్రమేణా వాడకంలో ఆర్‌సి పేపర్లు నలిగి పోయేవి. దీన్ని దష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకువెళ్లడాన్ని సులభతరం చేస్తూ ఆర్‌టిఒ అధికారులు తాజాగా ఆర్‌సి స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారు. క్రెడిట్ కార్డు మాదిరిగా ఆర్‌సి కార్డులో స్మార్ట్ చిప్ కలిగి ఉంటుంది. చిన్న స్మార్ట్ కార్డులోనే అన్ని వివరాలు పొందు పరిచి ఉంటాయి. సాధారణంగా కొత్త వాహనం కొనుగోలు చేసినప్పుడు సంబంధిత షోరూమ్ డీలర్ రిజిస్ట్రేషన్ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు, ఆర్‌సి స్మార్ట్ కార్డు జారీకి సర్వీసు ఛార్జీలు రూ.350, పోస్టల్ ఛార్జీలు రూ.30లు ముందుగానే వసూలు చేస్తారు. 2021 ఆగస్టు నుంచి వాహనాలు ఆర్సీ కార్డులు జారీ చేయడం లేదు. కాకినాడ జిల్లాలో 35 వేల మంది ఆర్‌సి కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. సర్వీసు ఛార్జీలు, పోస్టల్ ఛార్జీలు కలిపి ఒక్కొక్క వినియోగదారుడి నుంచి రూ.380 చొప్పున రూ.1,37,50,000 రవాణా శాఖ ఖాతాకి జమ అయ్యాయి. ఆర్‌సి స్మార్ట్ కార్డులు మాత్రం ఇవ్వడం లేదు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసినప్పుడు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డు తప్పనిసరిగా చూపించాలి. లేకపోతే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల పరిస్థితి కూడా అంతే..

కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ టెస్టులు పూర్తి చేసి లైసెన్స్ మంజూరు అయిన వారు జిల్లాలో 50 వేల మంది ఉన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఫీజుతో పాటు స్మార్ట్ కార్డు కోసం సర్వీసు ఛార్జీలు రూ.250, పోస్టల్ ఛార్జీలు రూ.30లు చొప్పున రవాణాశాఖ ఖాతాకి చెల్లించారు. డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసిన 15 రోజుల్లో స్మార్ట్ కార్డు పోస్టల్ ద్వారా ఇంటికి పంపించాలి. కానీ లైసెన్సులు పరిస్థితి కూడా అలాగే ఉందని పలు వాహనదారులు వాపోతున్నారు.

సురక్ష ఆంధ్రప్రదేశ్ లక్ష్యం : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కాకినాడ కార్పొరేషన్

'ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆడబిడ్డ మళ్లీ క్షేమంగా ఇంటికి చేరాలి. తనకు ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా చెప్పుకోవాలి. తన హక్కుల కోసం గొంతెత్తాలి. అలాంటి సమాజ నిర్మాణ కోసమే జనసేన పార్టీ పోరాటం చేస్తోంది' అని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. వారాహి యాత్రలో భాగంగా సోమవారం కాకినాడలో పార్టీ మహిళా విభాగం నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల కుటుంబానికే రక్షణ లేదని, విశాఖపట్నంలో సాక్షాత్తు ఒక ఎంపీ కుటుంబానికే రక్షణ లేకుండా పోయిందన్నారు. డబ్బుల కోసం కిడ్నాప్ చేశారన్నారు. ప్రజాప్రతినిధుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుడి పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

మత్స్యకారుల సమస్యలపై పవన్ ఆరా

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. జగన్నాథపురం నుంచి బోటులో ఏటిమొగకు వెళ్లారు. అక్కడ మత్స్యకారులతో భేటీ అయ్యారు. మత్స్యకారుల స్థితిగతులను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ కంపెనీల కార్యకలాపాల వల్ల మత్స్య సంపద దొరకడం లేదని పలువురు మత్స్యకారులు పవన్ దృష్టికి తీసుకువచ్చారు. చేపల వేట విరామం సమయంలో ప్రభుత్వం ఇస్తున్న వేట నిషేధ పరిహారం సరిపోవడం లేదని, అనేకమందికి అండడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడు ఆర్థికాభివద్ధి సాధించి ఆనందంగా ఉండాలన్నదే మా లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, పిఎంసి సభ్యుడు ముత్తా శశిధర్, మత్స్యకార వికాస విభాగం ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ప్రతిఘటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రజలంతా ప్రతిఘటించాలని పలువురు పిలుపు ఇచ్చారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు ఛార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యి ప్రజలకు షాక్ ఇస్తున్నాయని విమర్శించారు. గత సంవత్సరం కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందని, స్లాబులు మార్చేశారని, ప్రజల కళ్లుగప్పి పదేళ్ల నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా రూ.6 వేల కోట్ల భారం వేశారని విమర్శించారు. నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన భారం మోపారని తెలిపారు. రెండేళ్ళకో, మూడేళ్లకో కరెంట్ ఛార్జీలు పెంచేవారని, మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలు పెంచుతోందన్నారు. కరెంట్ బిల్లులే కాక ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారన్నారు. అసలు ఛార్జీలకంటే కొసరు ఛార్జీలు ఎక్కువయ్యాయని వామపక్ష నాయకులు విమర్శించారు. దాదాపు అన్ని బిల్లుల్లో 10 శాతం నుండి 50 శాతం వరకు సర్దుబాటు ఛార్జీల భారం పడిందని తెలిపారు. 200 యూనిట్లు లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తానని మాట ఇచ్చి జగన్ మోసం చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్‌ను క్రమంగా నీరుగారుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కె.వీరబాబు, న్యూ డెమోక్రసీ నాయకులు దుర్గారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న తాతారావు

యువకునిపై పెట్రోల్ పోసి నిప్పు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒక యువకునిపై పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటన మండలంలోని పటవల పంచాయతీ రామన్నపాలెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కాటాడి తాతారావు(బాబి)పై ఇద్దరు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. తాతారావు గ్రామంలోని అమ్మమ్మ, తాతయ్యల పూరిపాకలో ఒక గదిలో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు, ఇతరుల మధ్య తగాదాల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఇంటిలో నిద్రిస్తున్న తాతారావుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో అతడు కేకలు వేయడంతో గ్రామస్తులు కాకినాడలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తాతారావు తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

పవన్ వ్యాఖ్యలకు ద్వారంపూడి ఖండన

సమావేశంలో మాట్లాడుతున్న ద్వారంపూడి

ప్రజాశక్తి - కాకినాడ

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను దొంగను కాదు కాబట్టే కాకినాడలో రెండుసార్లు గెలిపించారన్నారు. తాను ఎవరి జోలికీ వెళ్లనని, తన జోలికి వస్తే ఊరుకోనని ఆయన హెచ్చరించారు. తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపించాలన్నారు. తాను పవన్ కల్యాణ్ కన్నా గట్టిగా విమర్శించగలనని చెప్పారు. సిఎం వైఎస్.జగన్ వల్లే కాకినాడ పోర్టులో అభివద్ధి జరిగిందని చెప్పారు. పవన్ కల్యాణ్ కులాలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2024లో చంద్రబాబు, పవన్‌ను తరిమివేయాలన్నారు.

అల్లూరి జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

ప్రజాశక్తి కాకినాడ

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి జూలై 4న ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సోమవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్‌డిఒ ఎన్‌వివివి.సత్యనారాయణకు సోమవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు సిహెచ్.అజయ్ కుమార్ మాట్లాడుతూ 2019లో ప్రభుత్వమే అల్లూరి జయంతిని అధికారికంగా నిర్వహించిందని గుర్తుచేశారు. వచ్చే జూలై 4న అల్లూరి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఆయన కోరారు. కాకినాడ జిల్లాలోనే అల్లూరి సీతారామరాజు పేరుమీద ఉన్న ఏకైక కాలనీ తూరంగి గ్రామ పంచాయతీలో అల్లూరి వారసత్వ ప్రాంతంగా ఉండడం చాలా గర్వకారణ మన్నారు. ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేయడం, ప్రజల మధ్య అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించడం భావితరానికి నేడు చాలా అవసరమన్నారు. ఆయన ఆశయాలను ప్రజలకు స్ఫూర్తివంతంగా ఉండేటా జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అల్లూరి సీతారామరాజు జరిపిన పోరాటాలు దేశవ్యాప్తంగా స్ఫూర్తి నింపాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్, డివైఎఫ్ఐ నాయకులు సాహిత్, ప్రసాద్, వాసు, పొట్నూరి జయప్రకాష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 316 అర్జీలు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం స్పందనలో అందిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, డిఆర్‌ఒ కె.శ్రీధర్ రెడ్డి, ఇన్‌ఛార్జి జెడ్‌పి సిఇఒ ఎ.రమణా రెడ్డి, బిసి, ఎస్‌సి కార్పొరేషన్ల ఇడిలు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, డిఎస్ సునీతలతో కలిసి హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కారించవలసిందిగా ఆయా శాఖల అధికారులను కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం-316 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కతికా శుక్లా మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తప్పనిసరిగా గడువులోపు సమస్య పరిష్కారం అయ్యే విధంగా అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ వార్ఫ్ రోడ్డులో నిర్మిస్తున్న పంపు హౌస్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంపు హౌస్ దగ్గర ఉన్న డ్రైనేజీని పరిశీలించారు. వర్షాల వల్ల డ్రైనేజ్ నిండకుండా ఎప్పుడు కప్పుడు డ్రైనేజ్ ఫ్రీగా ఫ్లో అయ్యేలా చూడాలని అక్కడే ఉన్న అధికారులను కమిషనర్ రమేష్ ఆదేశించారు.

సీతారామ్మూర్తిని కలిసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ వచ్చిన మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తిని కాకినాడ ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ పి.సీతాపతి రావు, ఆర్‌ఐ దీపక్ ఉన్నారు.

సెకండ్ ఎంఇఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి మండల సెకండ్ ఎంఇఒగా ములగపుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గాడి కొండబాబును నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చినట్లు గాడికొండ బాబు సోమవారం విలేకరులకు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కొండబాబును ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. **సామర్లకోట రూరల్** సెకండ్ ఎంఇఒగా పి.పుల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు హెచ్ఎంలు తోటకూర సాయి రామకృష్ణ, యుఎస్ఎన్.మూర్తి, కంటిపూడి గోపాల కృష్ణ, ఎస్‌వి రామారెడ్డి అభినందించారు.

సహకార సంఘాల ప్రయివేటీకరణ ఆపాలి

ధర్నాలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ

రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో విలీనం చేయడాన్ని అపాలని కోరుతూ జిల్లా డిసిసిబి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యన్నారాయణ, రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యన్నారాయణ, సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఆదినారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసరాజు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు రుణాలు అందించడంలో, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం సేకరించడంలో సహకార రంగ ఉద్యోగుల పాత్ర కీలకమని, సహకార రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి, సహకార రంగ ఉద్యోగులకు తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. ఈ ధర్నాలో కె.సత్తిరాజు, మలకా రమణ, పి.తంబయ్య, అప్పలరాజు, కొలంక రాము, సత్యానందం, చిట్టియ్య, కొండబాబు, శివనాగ, పి.సాయిబాబు, పి.సుబ్బారావు చంద్రమళ్ల పద్మ, రమణమ్మ పాల్గొన్నారు.

ఇవిఎంల గోదాము భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఎన్నికలు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివి.ప్యాట్ గోదామును రెవెన్యూ, ఎలక్షన్, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం, వివి ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబు (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి), కె.విజయరామారావు (బిజెపి), టి.మధు (సిపిఐ), కాకినాడ ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎన్.సురేంద్ర ఆనంద్, పట్ట తహసీల్దార్ సీతాపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు ఎం.జగన్నాథం, సిహెచ్.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకి ఎస్ఎఫ్ఐ జిల్లా బందం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, సహాయ కార్యదర్శి జి.దినేష్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ప్రారంభం రోజే అందరికీ పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లు ఇస్తున్నామని చెప్పినా నేటికీ పూర్తిస్థాయిలో విద్యా కానుక కిట్లు ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోతే పేద విద్యార్థులు ఏ విధంగా చదువుకోగలరని ప్రశ్నించారు. మరో పక్కనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తమ పాఠశాలలో అధిక ధరలకు ఇష్టం వచ్చినట్లుగా పాఠ్య పుస్తకాలను విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా అమ్మకాలు సాగిస్తున్నారని విమర్శించారు. కాకినాడ జిల్లాలో దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో వివిధ జిల్లాల నుంచి వచ్చి చదువుతున్న గిరిజన విద్యార్థులు రెండేళ్ల నుంచి జగనన్న విద్యాదీవెన డబ్బులు తమ అకౌంట్లలో పడటం లేదని తెలిపారు. తక్షణమే విద్యా దీవెన డబ్బులు తమ అకౌంట్లో వెయ్యాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కార్టూ'నిజం'

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం

జగనన్న ఆణిముత్యాలుగా పేరు తెచ్చుకున్న విద్యార్థినులకు మంచి భవిష్యత్ ఉంటుందని పలువురు అన్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను సోమవారం పలుచోట్ల ఘనంగా సత్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

తుని (జగ్గంపేట) జగన్నాథగిరి ఎపి రెసిడెన్సియల్ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో స్కూల్ ప్రిన్సిపల్ నక్కా వెంకటలక్ష్మి మాట్లాడారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకుని జిల్లా స్థాయిలో జగన్నాథగిరి బాలికల వసతి గృహాన్ని నిలిపినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలో బి.సూర్య రామా తులసి ప్రథమ బహుమతిగా రూ.50 వేల బహుమతి, కె.అనూషా రూ.30 వేలు, ఎస్.విజయ రూ.15 వేల నగదు బహుమతి, మెమెంటోలను కలెక్టర్ ద్వారా ఇటీవల తీసుకున్నట్టు ఆమె తెలిపారు. సంబంధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సోమవారం పాఠశాల చైర్మన్, సిబ్బంది సమక్షంలో సన్మానించారు. గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్ తమరాన రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది ఎటిపి రాజేష్, శ్రీనివాస్, వార్డెన్ రామయ్య, డిప్యూటీ వార్డెన్ ఎర్రయ్యమ్మ, రామునాయుడు, ఉమాదేవి, ఆశా, రమణి, భారతి, శివకుమారి, నారాయణుడు తదితరులు సన్మాన సభలో పాల్గొన్నారు. **తాళ్లరేవు** విద్యలో ప్రతిభావంతులను గుర్తించేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ అన్నారు. చొల్లంగిపేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల అందజేతలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ లక్ష్యసాధనకు అంకితభావంతో కషి చేయాలని సూచించారు. జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలలో నిలిచిన నిరీష, అనూష, స్వాతిని సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. గురుకుల పాఠశాల హెచ్ఎం. పద్మావతి, ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావు, స్థానిక నాయకులు కందెల్ల గంగబాబు, నీలపాల సత్తిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కోటనందూరు** అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేకాధికారి జి.రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఎంపిపి లగుడు శ్రీనివాస్ మాట్లాడారు. ప్రథమ స్థానం అల్లు దేవి నిరీక్ష, ద్వితీయ స్థానం లోకవరపు హరిప్రియ, తతీయ స్థానం ఏక లావణ్య దేవి సాధించడంపై అభినందించారు. వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, కొరిప్రోలు కష్ణ, సర్పంచ్ జగడాల వీరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరిపే నూకాలమ్మ, నెమ్మాది చిట్టిబాబు, నాయుడు, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అల్లిపూడిలో విద్యార్థులను సత్కరిస్తున్న శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

డయల్ యువర్ కమిషనర్‌కు 11 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ కమిషనర్ రావిరాల రమేష్ ఏర్పాటు చేసిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో సోమవారం సుమారు 11 మంది నుంచి ఫోన్ల ద్వారా తమ సమస్యలను విన్నవించుకున్నారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ రమేష్ సంబంధిత అధికారులకు వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్, పారిశుధ్యం వంటి వాటిపై ప్రజలు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా సమస్యలను విన్నవించినట్టు తెలిపారు. తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ఎస్ఇ సత్య కుమారి, డిఎంహెచ్ఒ పథ్వీచరణ్, డిపిఒ హరిదాసు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం జాతీయ రహదారి 216పై సుంకట రేవు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మతి చెందారు. కోరంగి పోలీసుల సమాచారం మేరకు కాకినాడ నుంచి యానాం వెళుతున్న ప్రభుత్వ అంబులెన్సును యానాం నుంచి కాకినాడ బైకుపై వెళుతున్న ఇద్దరు సుంకట రేవు వద్ద ఢీకొన్నారు. అదే అంబులెన్స్‌లో వారిని యానాం ఆసుపత్రికి తరలించారు. ఘటనలో బలమైన గాయాలు కావడంతో నల్లి బాలకష్ణ (20) చింత అరుణ్ బోస్(23) అప్పటికే మృతి చెందారు. వారిద్దరూ రాజోలు మండలం పొన్నమండకు చెందిన యువకులని, వారి వాహనంలో లభించిన ఆధారాలు ప్రకారం బంధువులకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని వాడపేటలో ఈ నెల 13న జరిగిన చోరీ కేసులో నిందితుని అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు సిఐ కె.మంగాదేవి తెలిపారు. పల్లి రామకష్ణ ఇంటిలో ప్రవేశించి బీరువా తలుపులు బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, రూ.80,000 వేలు అపహరించారు. దీనిపై నిందితుడు చికోటి కామేశ్వరరావుని అదుపులోనికి తీసుకుని విచారించారు. అతడి వద్ద చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216పై జైభీమ్ పేట వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ సీతారాంపురం నుంచి పల్లంకుర్రు వెళుతున్న భీమారావు యానాం నుంచి పగడాలపేట వెళ్తున్న రవి, ప్రసాద్ బైకులు జై భీమ్ పేట కూడలిలో ఆదివారం అర్ధరాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భీమారావు, రవి, ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు హైవే పోలీసుల సాయంతో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం, గండేపల్లి

పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో సోమవారం ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తి పై కేసు నమోదు చేశామన్నారు.

గండేపల్లి మండలం బొర్రంపాలెం శివారు పుష్కరకాలువ గట్టుపై నాటుసారా స్థావరంపై ఎస్ఐ వై.గణేష్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన కేతా వీరబాబును అరెస్టు చేసి అతని వద్ద నుండి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

గూడ్సు వ్యాగన్‌లో పొగలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న గూడ్స్ రైలు వ్యాగన్‌లో మంటలు రావడంతో సామర్లకోట రైల్వే స్టేషన్లో ఆపి మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం సంభవించిన ఈ ప్రమాదంలో సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ దగ్గరుండి రైల్వే శాఖ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. గూడ్స్ రైలు 16వ వ్యాగన్‌లో పొగలు, మంటలు రావడాన్ని పిఠాపురం స్టేషన్ మాస్టర్ నాగబాబు గమనించారు. పిఠాపురం స్టేషన్లో హాల్టు లేని కారణంగా ఆ విషయాన్ని సామర్లకోట స్టేషన్ మాస్టర్ రమేష్‌కు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. దీంతో గూడ్స్ రైలు సామర్లకోట చేరుకోగా డ్రైవర్‌ను అధికారులు అప్రమత్తం చేసి స్థానిక గూడ్స్ యార్డులో లూప్ లైనులోకి మళ్లించారు. అనంతరం స్థానిక స్టేషన్ మేనేజర్ రమేష్ పెద్దాపురం అగ్నిమాపక సిబ్బందిని రప్పించి బొగ్గు వ్యాగన్‌లో ఏర్పడిన మంటలను అదుపు చేశారు. మిగిలిన వ్యాగన్లను సైతం వారు పరిశీలించి ఏలాంటి ప్రమాదం తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించి గూడ్స్ రైలును పంపించారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖల అధికారులు, ఇంజనీరింగు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొని సేవలనందించారు.

పశువుల పాక, గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వెదురుమూడిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక, గడ్డివాము దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామంలోని కౌలు రైతు నక్కా సింహాచలానికి చెందిన పశువుల పాక, నీటి ఇంజన్, సుమారు 10 ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియ రాలేదు. సమాచారం అందుకున్న మండపేట ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కక్ష పూరితంగా పలువురు ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చునని బాధితుడు సింహాచలం తెలిపారు. దీనిపై అంగర పోలీసులకు ఫిర్యాదు చేసానన్నారు.

తిరుమలాయపాలెం ఘటనకు కారకులను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

గోకవరం మండలం తిరుమలాయ పాలెం గ్రామంలో దళిత మహిళలపై దాడికి కారకులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని, తొలగించిన అంబేద్కర్ విగ్రహం ప్రభుత్వం తిరిగి యథాస్థానం లో పెట్టాలని విసికె పార్టీ దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఘటన ను ఖండిస్తూ డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఆ కార్యక్రమంలో విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ, దళిత నాయకులు, గెద్దాడ బుద్ధ రాజ్, ముత్తాబత్తుల రమణ, నాగవరపు అన్నవరం, మెండి డేవిడ్ అంబేద్కర్, పోలమూరి సందీప్ తదితరులు పాల్గున్నారు.

ఉపాధి బకాయిలు తక్షణం విడుదల చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలందరికీ వేతనాల బకాయిల వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే పనిలో ఉన్నాయన్నారు. ఏడాదిలో 200 రోజులు కూలీలకు పని కల్పించవలసిన ఉపాధి హామీ పథకంలో 50 రోజులు కూడా పనులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు వెంటనే డబ్బులు ఇవాల్సింది పోయి ఐదు వారాలుగా వారికి వేతనాలు ఇవ్వటం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు పని దినాలు పెంచడంతోపాటు పనిచేసిన ఉపాధి కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు నీలపాల సూరిబాబు, ప్రత్తిపాటి సత్యనారాయణ, కోరా రాజు, చీకట్ల మోషే తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నైపుణ్యం విజయాలకు సోపానం

ప్రజాశక్తి - పెద్దాపురం

క్రమశిక్షణ, నైపుణ్యం పెంపొందించుకుంటూ కరాటేలో మరిన్ని విజయాలు సాధించాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు విద్యార్థులకు సూచించారు. సమ్మర్ క్యాంపు కరాటేలో శిక్షణ పొంది విశాఖపట్నం కరాటే నేషనల్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన దుంగల పూజితా సూర్యశ్రీని సోమవారం యాసలపు సూర్యారావు భవనంలో అభినందించారు. బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వీర్రాజు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచీ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం సిద్ధిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆయన సమ్మర్ క్యాంపులో 35 రోజులపాటు కరాటేలో శిక్షణ ఇచ్చి నేషనల్ పోటీల్లో పతకాలు సాధించే విధంగా తీర్చిదిద్దిన కరాటే టీచర్ పూజితా సూర్యశ్రీని ఆయన అభినందించారు. మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు కరాటేలో మరిన్ని విజయాలు సాధించి పెద్దాపురం పట్టణానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ సభలో జెవివి రాష్ట్ర నాయకులు బి.అనంతరావు, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి కష్ణ, రొంగల వీర్రాజు, కరాటే టీచర్ పూజితా సూర్యశ్రీ ప్రసంగించారు. ఈ సభలో మంజుల, జ్యోత్స్న, సూరజ్, కూనిరెడ్డి రవికుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాపట్ల ఘటన దోషులను శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

పదవ తరగతి విద్యార్థిని సజీవ దహనం చేసిన కేసులో దోషులను వెంటనే శిక్షించాలని టిడిపి నాయకులు సంతపేట సెంటర్‌లో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడారు. బాపట్ల జిల్లాలో విద్యార్థి ఉప్పాల అమరనాథ్ గౌడ్‌ను వైసిపికి చెందిన వెంకటేశ్వర రెడ్డి అతని మిత్రులు పెట్రోల్ పోసి సజీవ దహనం చేశారన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లో పోస్టర్లు అంటించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసంగి ఈశ్వరరావు, పులపకూర అప్పారావు, కోరుకొండ అప్పారావు, కాట్రు వీరపండు, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, చక్రవర్తి, వరదరాజు, కుడిపూడి రామకష్ణ, పిల్లి సత్తిబాబు, జక్కల ప్రసాద్, మోర్త భైరవమూర్తి, చంద్రాల బుజ్జి, మేడిశెట్టి సత్తిబాబు, దున్నా మురళి, వాసంశెట్టి శ్రీనివాస్, కొప్పిశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

సిసిఆర్‌సి కార్డుకు రెవెన్యూ అధికారిని సంప్రదించాలి

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఖరీఫ్ పంట వేసే ప్రతి కౌలు రైతుకు కౌలు రైతు కార్డ్ ను మీ గ్రామ రెవెన్యూ అధికారి ని సంప్రదించి తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రవీణ్ సూచించారు. కౌలు రైతు కార్డ్ ను కౌలు రైతు కు ఇచ్చే విధముగా భూ యజమానులు సహకరించాలన్నారు. దీనివల్ల కౌలు రైతు తమ ధాన్యం ని మద్దతు ధరకే అమ్ముకోగల్గుతారని, భూ యజమానికి మరియు కౌలు రైతు కు కూడా రైతుభరోసా వర్తిస్తుందని తెలిపారు. అంతే కాకుండా భూ యజమాని భూమికి గాని, యాజమానికి గాని సంబంధం లేకుండా కార్డ్ ఉన్నకౌలు రైతుకు వచ్చే రబీ సీజన్ నుండి ఎకరాకు రూ.25,000 నుంచి 4 ఎకరాల వరకు రూ.1,00,000 రుణం (సొంత లోన్)ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి కౌలు రైతులు తమ యజమానులకు వివరించి (సి సి ఆర్ సి) కౌలు కార్డులు పొందాలని తెలియజేసారు. దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని అయన కోరారు.

అంబాజీపేట ఎంపిడిఓగా సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-అంబాజీపేట

బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణమూర్తి

అంబాజీపేట ఎంపిడిఒగా కె.సత్యనారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రత్తిపాడులో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ మండపేట ఎంపిడిఒగా బాధ్యతలు తీసుకుని డిప్యూటేషన్ పై అంబాజీపేట ఎంపిడిఓ బాధ్యతలు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డిఒ బి.మమత, సీనియర్ అసిస్టెంట్ వీరేశ్వరరావు, జి. ఎస్.ఆదిత్య, టైపిస్ట్ ఎమ్.బాలా మణి, కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది ఆయనను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యుడు బూడిద వరలక్ష్మి ,ఎంపిటిసిలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గోరుముద్దలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

ప్రజాశక్తి-మండపేట

జగనన్న గోరుముద్దను పరిశీలిస్తున్న రాణి

ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. స్థానిక 20వ వార్డు వైయస్ఆర్ కాలనీలోని ఎస్ఎస్‌వివి.స్కూల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. అదే వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13.90 లక్షలతో సిసి రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని పరిశీలించి పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, చెప్పులు తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిల్ సభ్యులు చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబీ అప్పనబాబు, శెట్టి కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ టి రామ్ కుమార్, వైసిపి పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు దోపిడీ అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ అరికట్టాలని పిడిఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ సింధుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పిడిఎస్‌యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి. సిద్ధూ మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. జూన్ 1 నుండి ప్రభుత్వ కాలేజీలు, 12 నుండి పాఠశాలలు తెరిచి వారం రోజులు కావస్తోందని. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక, పాఠ్యపుస్తకాలు పూర్తిగా రాక, అర్హత ఉండి అమ్మ ఒడి,విద్యాదీవెన,వసతి దీవెన రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అనేక రకాల ఫీజులు వసూలు చేసి చట్ట విరుద్ధంగా విద్యార్థులు తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబటి కృష్ణ, ఎం.రాజు, దుర్గారావు పాల్గొన్నారు.

'శ్రీ నేస్తం' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రాజోలు

శ్రీ నేస్తం సేవా సమితి సేవలు అభినందనీయమని రాష్ట్ర నెడ్ కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు.సోమవారం మలికిపురం మండలం గుడిమల్లంక గ్రామం టి సా వరంలో అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్న కడలి లక్ష్మీప్రసన్నకు శ్రీ నేస్తం సేవా సమితి సమకూర్చిన 30 వేల ఆర్థిక సహాయాన్ని లక్ష్మి ప్రసన్న తండ్రీ రాంబాబుకి రాష్ట్ర నెడ్ కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అందజేశారు. ఎంపీటీసీ అంజలి, మాజీ ఏఎంసీ చైర్మన్ చెల్లించి అబ్బులు, మాజీ ఎంపీటీసీ కడలి బుల్ రెడ్డి, శ్రీ నేస్తం సేవా సమితి సభ్యులు దొంగ లక్ష్మీ నరసింహ స్వామి, బొక్క బాలకృష్ణ, గుత్తుల వాసు, పెచ్చెట్టి శ్రీను, చెల్లింగి సత్యప్రసాద్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-కాకినాడ

ఉత్తమ సేవలందించిన ఆరోగ్యమిత్రలలకు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలు అమలులో భాగంగా నిరంతరం వైద్యం కోసం వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు అందించిన సేవలకుగాను రాష్ట్ర ప్రభుత్వం సేవా ఆరోగ్యమిత్ర పురస్కారం ఏర్పాటు చేసింది. ఏప్రిల్ నెలకు గాను కొప్పిశెట్టి బుజ్జి (జిజిహెచ్ కాకినాడ), మే నెలకు గాను గీసాల శ్రీను (రాఘవ హాస్పిటల్-కాకినాడ)కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.రాధాకష్ణ (డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్-ఆరోగ్యశ్రీ), కె.నవీన్ (డిస్ట్రిక్ట్ మేనేజర్-ఆరోగ్యశ్రీ,) టీమ్ లీడర్ రాయుడు బుల్లబ్బాయి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కోటనందూరు

తుని పట్టణంలో 28వ వార్డులో రెండు సిసి రోడ్లు నిర్మాణానికి సోమవారం తుని మున్సిపాలిటీ చైర్మన్ ఏలూరు సుధా రాణి శంకుస్థాపన చేశారు. రోడ్డు అధ్వానంగా ఉందని కౌన్సిలర్ చింతకాయల భారతికి స్థానికులు తెలపడంతో ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి దష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో రూ.10 లక్షల నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో తుని మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ రాజు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరు బాలు, వైస్ చైర్మన్ పామర్తి మహేష్, అనిశెట్టి సూరిచక్రరెడ్డి, చింతకాయల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆనూరులో గడపగడపకూ..

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆనూరులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ సిఎం వైఎస్.జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, గోపు మురళి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గండేపల్లి

యల్లమెల్లికి చెందిన టిడిపి సీనియర్ నేత పెనుమర్తి వెంకట్రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు భాస్కరరావు సోమవారం అన్నదానం నిర్వహించారు. జగ్గంపేట ఎన్‌టిఆర్ స్మారక మందిరం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, జగ్గంపేట, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడమే ఎన్‌టిఆర్ ఆశయం అన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడంలో భాగంగా చంద్రబాబు అన్న క్యాంటీన్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, పాలకుర్తి ఆదినారాయణ, కోడూరి రమేష్, కొండ్రోతు శ్రీను నాగిరెడ్డి అనిల్, సుంకవిల్లి పల్లారావు, బొట్ల సూర్యనారాయణ, పెనుమర్తి వీర్రాజు పాల్గొన్నారు.

28 న కోటిపల్లి రేవుకు వేలం

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత రెండు నెలలుగా వాయిదా పడిన కోటిపల్లి రేవుకు ఈ నెల 28 న బహిరంగ వేలం నిర్వహిస్తామని మండల పరిషత్ అధికారి ఎన్.శ్రీనివాస్ రావు ఒక ప్రకటన లో తెలిపారు. దీనికి కనిష్ట ధరగా రూ.68.12 లక్షలు నిర్ణయించారన్నారు. టెండరు కొరకు ధరఖాస్తులను ఈ నెల 26 నుంచి 27 వరకూ మండల పరిషత్ కార్యాలయం వద్ద తీసుకోవచ్చని, దరఖాస్తు దారుడు ధరావత్తు రూ.13,62,460 లు చెల్లించాలన్నారు. సీల్డ్ టెండర్ లు ఈనెల 28 మధ్యాహ్నం 12 గంటల వరకు తెరవబడతా యన్నారు. 28 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆయన వివరించారు. వివరాల కోసం మండల పరిషత్ కార్యాల యంలో సంప్రదించాలన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధి సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో వేతనదారుల సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ అనుపమకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడారు. ఉపాధిలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, పేస్లిప్స్ ఇప్పించాలని, ప్రతి శుక్రవారం వేతనదారుల సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు మినిట్స్ బుక్‌లో నోట్ చేయాలని, ఉపాధి హామీ వేతనదారులకు ఐడెంటిటీ కార్డులు, ప్రింటింగ్ జాబు కార్డులను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు దుప్పి అదష్ట దీపుడు , మందనక్క తణుకు రాజు ఉన్నారు.

హెచ్‌సి టైసన్‌కు రెండు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి హెడ్ కానిస్టేబుల్ జీఎస్ఎన్ మూర్తి (టైసన్) 110 కేజీల పవర్ లిఫ్టింగ్ ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించడంతో పోలీసు ఉన్నతాధికారులు ఆయనను అభినందించారు. మలికిపురంలో నిర్వహించిన పోటీల్లో ఆయన ఈ మెడల్స్ సాధించారు. ఆయనను సిఐ సూర్య అప్పారావు, ఎస్ఐలు వై.గణేష్ కుమార్, సుధాకర్, రఘునాథరావు అభినందించారు

ఘనంగా మరిడమ్మ జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా స్థానిక చేపల వీధి శెట్టిగపేట ప్రజలు అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంబరం ప్రారంభ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరేళ్ల వీరరాఘవ, సిమ్మ సూర్యావతి తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరంలో విద్యుత్ దీపాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు ప్రజలను, విశేషంగా ఆకట్టుకున్నాయి.

యానాం వార్తలు

లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్‌లో ఎంఎల్ఎ గొల్లపల్లి

ప్రజాశక్తి -యానాం

మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరుగుతున్న నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్‌లో యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 2,500 మంది ఎంఎల్ఎలు, ఆయా అసెంబ్లీల స్పీకర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మూడు రోజుల పాటు సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశంలో సామాజిక అభివద్ధికి ప్రధానంగా 10 అంశాలపై సాంకేతికత, ఆర్థికాభివద్ధి దిశగా అధికారులు, శాసనసభ్యుల పాత్ర తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి మాట్లాడుతూ దేశంలో సామాజిక అసమానతలు రూపు మాపడంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

యానాంలో జనసేన నేత బొలిశెట్టి పర్యటన

ప్రజాశక్తి - యానాం

జనసేన ప్రధానకార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ సోమవారం యానాంలో పర్యటించారు. మంగళవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ యానాం బైపాస్ మీదుగా ముమ్మిడివరం వెళ్ళనున్నారు. ఈ మేరకు యానాం బైపాస్‌లో సెంటర్లో ప్రజలకు అభివాదం చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లలో భాగంగా బొలిశెట్టి సత్యనారాయణ యానాం వచ్చారు. ఆయనకు యానాం పవన్ కళ్యాణ్ అభిమానులు చింతా శివ ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంచాల జిమ్మీ, గుద్దటి జిమ్మీ, సలాది రాజా, బాబి, బంగారం, అజయ్, స్వామి, వెంకటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి తెచ్చే విధంగా రైతులకు లబ్ధి చేకూర్చడంలో ముఖ్యమంత్రి ఎనలేని కషి చేస్తున్నారన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. భీమనపల్లి లో మంత్రి విశ్వరూప్,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రైతులకు ఆర్ బి కె ల ద్వారా నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు అందించడంతోపాటు వైఎస్ఆర్ యంత్ర పరికరాలు అందించడం ద్వారా రైతుల్లో విశ్వాసం పెంపొందే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ నేరుగా వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని మంత్రి విశ్వరూప్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ తాను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి వరి నాట్ల సమయంలో రైతులతో కలిసి పొలాల్లో వరి విత్తనాలు చల్లడం (నారుమడులు వేయడం) ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా లు రైతు యాళ్ల దుర్గారావు పొలంలో సంపద(ఎంపి 9558)రకం వరి విత్తనాలను పంట పొలాల్లో వెదజల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఎంపిటిసి సభ్యుడు దేశంశెట్టి నాగరత్నకుమారి, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరి బాబి, డాక్టర్ వై ఎస్ ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను,సొసైటీ చైర్మన్ శిరంగు సత్తిరాజు, పాల్గొన్నారు.

బాధితునికి గుడ్ సీడ్ సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

నిత్యావసరాల సరుకులు అందిస్తున్న సభ్యులు

ప్రమాదంలో కాళ్ళు విరిగి గాయపడి చికిత్స పొందు తున్న బాధితునికి సోమవారం అమలా పురం నియోజక వర్గ వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణా రావు నిత్యావసర సరుకులు అందజేశారు. చల్లపల్లి పంచాయతీ చింతలచెరువుకు చెందిన సవరపు ఏడుకొండలు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధిత కుటుంబం ఇబ్బందులు పడుతున్నందున నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. కార్యక్రమంలో బుంగా నూకారావు, నాగవరపు నాగేంద్ర, జనిపెల్ల శ్రీను, బూసి అర్జున్న,కుంచే నరేష్, సత్తిబాబు, సవరపు మేరి, సత్యవతి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

నేను, నిడదవోలు వీర వెంకట శ్రీనివాసు, తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం: 4-2, తాడిపర్రు, ఉండ్రాజవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా, అను నా పేరున ఉన్న పాస్‌పోర్ట్ నం. **B5616382**రు గలది ఒరిజినల్ తాడిపర్రు నుండి ఉండ్రాజవరం వచ్చుచుండగా దారిలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్‌కు తెలియజేయగలరు.

నిడదవోలు వీర వెంకట శ్రీనివాసు
తండ్రి: సత్యనారాయణ, డో.నెం:4-2,
తాడిపర్రు , ఉండ్రాజవరం మండలం,
తూర్పు గోదావరి జిల్లా.
సెల్: 98489 93993

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE -cum- M.A.C.T. AT SRIKAKULAM.
I.A.155/2023 in M.V.O.P. 187/2022.

Between: Smt.Kadiyala Gowri Devi & 2 others --Petitioners.
And: Tangella Jiyyanna & 2 others --Respondents.

To,
R-2. Pynda Sri Rama Krishna Sreshty, S/o Venkata Rama Mohana Rao, Aged 47 years, Owner of Lorry bearing No.AP-05-TC-5139, R/o Door No.4-11-2/18, Ashok Nagar, Kakinada, East Godavari District.

NOTICE

That the above named Petitioners has filed the above M.V.O.P. for claiming compensation under M.V. Act, against you and 2 others and the same is posted to **04-07- 2023** for your appearance before the Honourable Court. Therefore you are hereby directed to appear before the Honourable Court on **04-07-2023 at 10-30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided as per Law in your absence.

(By order of the Honourable Court)

K.SESHAGIRI RAO
Advocate, Srikakulam,
Mobile: 9542637477.